## వర్మి కంపోస్ట్ ఎరువు తయారీపై శిక్షణ



రుద్రూర్ కేవీకేలో వర్మి కంపోస్ట్ ఎరువు తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్

రుద్రూర్, జూన్ 1 : రుద్రూర్ కేవీకేలో రైతులకు వర్మి కంపోస్ట్ ఎరువు తయారీ విధానంపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కంపోస్టు ఎరువుతో పంటకు కలిగే ప్రయోజనాలను శాస్త్రవేత్తలు వివరించారు. సేంద్రియ వ్యర్థాలను ఉపయోగించి వర్మి కంపోస్ట్ ఎరువును ఎలా తయారు చేయాలో రైతులకు శిక్షణ ఇచ్చారు. మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, డీఆర్‌డీప కో-ఆర్డినేటర్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహానికి 8.20 కిలోల వెండి తొడుగు



వెండి తొడుగును అందజేస్తున్న దాతలు

చందూర్, జూన్ 20 : మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయంలో విగ్రహానికి 8 కిలోల 200 గ్రాముల వెండి తొడుగును శనివారం ఏర్పాటు చేశారు. దాతలు వెండి తొడుగు చేయించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయారెడ్డి, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

డిచ్‌పల్లి, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి యోహన్, ఎంపీడీవో రవీందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో ఈ నెల 12వ తేదీలోగా పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో న్యూరో శస్త్రచికిత్సలు

- రెండు నెలల్లో 20 మందికి ఆపరేషన్లు
- వివరాలను వెల్లడించిన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్

ఖలీల్‌వాడి, జూన్ 1 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో రెండు నెలల క్రితం న్యూరో శస్త్రచికిత్సలు ప్రారంభించామని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ తెలిపారు. దవాఖానలో శనివారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్‌లో మాత్రమే న్యూరో శస్త్ర చికిత్సలు నిర్వహించేవారని, ప్రస్తుతం నిజామాబాద్‌లో కూడా సేవలను అందిస్తున్నామని అన్నారు. రెండు నెలల్లో ఇద్దరు చిన్నారులతో సహా 20 మందికి న్యూరో శస్త్రచికిత్సను నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించామని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి, సరైన ఆధారాలు లేకపోయినా శస్త్రచికిత్స చేశామని తెలిపారు. ప్రైవేట్ దవాఖానల్లో సుమారు రూ. 3 లక్షల నుంచి రూ. 7 లక్షల ఖర్చుతో కూడుకున్న వైద్యాన్ని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అందజేయడంపై సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే..

- ఇక నుంచి పకడ్బందీగా రూల్స్ అమలు
- పోలీస్, ఆర్టీప ఆధ్వర్యంలో కంబైన్డ్ డ్రైవ్‌కు శ్రీకారం

వినాయకనగర్, జూన్ 1 : ప్రతి వాహనదారుడు ఇక నుంచి ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని సీపీ కల్మేశ్వర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీస్, ఆర్టీప ఆధ్వర్యంలో కంబైన్డ్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టామని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై ప్రత్యేక దృష్టిసారించి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు పూర్తిగా లేకున్నా, నంబర్లు తారుమారు చేసినా, మద్యం తాగి వాహనం నడిపినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకోకున్నా, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్లు వాహనం నడిపితే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామని, వాహనదారులు నిబంధనలు తప్పక పాటించాలని కోరారు.

## నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, జూన్ 1 : జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో నేడు (ఆదివారం)తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌతంనగర్, నాందేవ్‌వాడ, గోల్‌హనుమాన్, వినాయక్‌నగర్, తిలక్‌గార్డెన్, ఎల్లమ్మగుట్ట, మహాలక్ష్మీనగర్, మిర్చి కంపౌండ్, సుభాష్‌నగర్, కంఠేశ్వర్, కంఠేశ్వర్, గంగస్థాన్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల నేపథ్యంలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

## నేడు కవిసమ్మేళనం

సుభాష్‌నగర్, జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా హరిదా రచయితల సంఘం -నిజామాబాద్ అధ్వర్యంలో నేడు (ఆదివారం) కవి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు సమన్వయకర్తలు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భాషాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యాబోధన



ఎత్తొండలో విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్న అధ్యాపకులు

కోటగిరి, జూన్ 1 : ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యాబోధన ఉంటుందని కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎత్తొండ, ఎత్తొండ క్యాంప్‌లో అధ్యాపకుల బృందం ఇంటింటికీ తిరిగి పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన, వసతులు, సౌకర్యాలు గురించి అవగాహన కల్పించారు. చేతన్‌నగర్‌లో 20 మంది విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్‌తోపాటు అధ్యాపకులు రాము, ప్రభాకర్, శ్రీలత, దత్తాత్రి, సంతోష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణికి సన్మానం



మౌనికను సన్మానిస్తున్న మంత్రి, రూరల్ ఎమ్మెల్యే

కంఠేశ్వర్/ ధర్పల్లి, జూన్ 1 : ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన క్రీడాకారిణి మౌనికను జిల్లాకేంద్రానికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం అభినందించారు. శ్రీలంకలో ఇటీవల నిర్వహించిన అండర్ -20 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో మౌనిక ఉత్తమ ప్రతిభ కనబర్చి, బంగారు పతకాన్ని సాధించినట్లు కోచ్ లతీఫుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెను సన్మానించి, త్వరలో సౌత్ కొరియాలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రూ. 50 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

### మంత్రికి ఘన స్వాగతం

ఇందల్వాయి, జూన్ 1 : జిల్లాకు వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంత్రిని సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు మండలంలోని పలు సమస్యలపై మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు రాజేందర్ రెడ్డి, దశరథ్, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సాంస్కృతిక బోధనా తరగతుల శిబిరం



విద్యార్థులకు బోధిస్తున్న లింగేశ్వర గుట్ట ఆశ్రమపీఠాధిపతి పిట్ల కృష్ణమహరాజ్

సారంగాపూర్, జూన్ 1 : మండలంలోని మల్లారంలో ఉన్న లింగేశ్వర గుట్ట ఆశ్రమంలో చిన్నారులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక బోధనా తరగతుల శిబిరం శనివారంతో ముగిసింది. 16 మంది ఉపాధ్యాయులు సనాతన ధర్మం, ఆధ్యాత్మికత, హిందూ ధర్మం తదితర అంశాలపై విద్యార్థులకు బోధించారు. పడిగెల్ ఆశ్రమ పీఠాధిపతి విశ్వోకానంద తీర్థస్వామి, లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ శిబిరంలో బోధనలు చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల నుంచి 7-10వ తరగతి చదువుతున్న 183 మంది విద్యార్థులు శిబిరానికి హాజరైనట్లు తెలిపారు.

## గణిత ఉపాధ్యాయులే గణితాన్ని బోధించేలా చూడాలి

**రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల జిల్లా ఫోరం నాయకుల వినతి**

ఖలీల్‌వాడి, జూన్ 1 : గణిత ఉపాధ్యాయులతోనే గణితాన్ని బోధించేలా చూడాలని, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులను గణితం బోధించాలని విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలను నిలిపివేయాలని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల జిల్లా ఫోరం నాయకులు కోరారు. హైదరాబాద్‌లో విద్యాశాఖ అడిషినల్ డైరెక్టర్ లింగయ్యను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6, 7వ తరగతుల విద్యార్థులకు గణితాన్ని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బోధించాలని రాష్ట్ర ప్రభుత్వ సూచనల ప్రకారం విద్యాశాఖ మెమో ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్, ప్రధానకార్యదర్శి రాజశేఖర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేశ్, నరేందర్, పోచన్న, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల జిల్లా ఫోరం నాయకులు

## జిల్లావ్యాప్తంగా ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి

సుభాష్‌నగర్/కోటగిరి/ శక్కర్‌నగర్, జూన్ 1 : జిల్లావ్యాప్తంగా అన్ని హనుమాన్ ఆలయాల్లో పెద్ద హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ విగ్రహాలను అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

## మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, జూన్ 1 : ఎండలు తీవ్రంగా ఉండడంతో జిల్లాకేంద్రంలోని రోకడ్ హనుమన్ ఆలయం వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరై మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, విజయారావు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కార్యాలయాలు ముస్తాబు

కోటగిరి/ కంఠేశ్వర్/ సిరికొండ, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌తోపాటు ప్రభుత్వ, జీపీ కార్యాలయాలను ముస్తాబు చేశారు. కలెక్టరేట్ భవనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏర్పాట్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించనున్నారు. కోటగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు ఎంపీపీ సునీతా శ్రీనివాస్ జెండాను ఎగురవేస్తారని ఎంపీడీవో మారుతి తెలిపారు. సిరికొండ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 8.30 ఎంపీపీ సంగీతా రాజేందర్ జెండాను ఆవిష్కరిస్తారని ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ తెలిపారు.

## ముగిసిన బీరప్ప ఉత్సవాలు

సారంగాపూర్, జూన్ 1 : మండలంలోని తిర్మన్‌పల్లిలో కుర్మ కులస్తుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బీరప్ప పండుగ శనివారంతో సంపూర్ణమైంది. సంప్రదాయంగా ఐదేండ్లకోసారి బీరప్ప పండుగను నిర్వహిస్తామని కులపెద్దలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 18 మందితో కూడిన కళాకారుల బృందం ఒగ్గు కథ, ఎల్లమ్మ కథ వినిపించారు. ఈ సందర్భంగా వారు పాడిన పాటలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కౌలాస్ శ్రీనివాస్, నర్సయ్య, అశోక్, శ్రీనివాస్, ప్రతాప్, శేఖర్, ఇందూరు మోహన్, సంజీవ్ నేతృత్వంలో ఉత్సవాలను నిర్వహించారు.

## చట్టాల అమలుపై అవగాహన

శక్కర్‌నగర్, జూన్ 1: బోధన్ పట్టణంలోని న్యాయస్థానంలో పోలీసులకు చట్టాల అమలుపై న్యాయమూర్తులు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ చట్టాలను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డాక్టర్ పల్నాటి సమ్మయ్య, శ్యాంరావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి వివరించారు. పోలీసులు చట్టాల అమలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రుద్రూర్ సీఐ జయేశ్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు, ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్, ఎస్సైలు సందీప్, అప్పారావు, రామారావు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## వరద కాలువలో పడి ఒకరి మృతి

మోర్తాడ్, మే1: మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీకి చెందిన కూరగాయల సుధాకర్(34) గ్రామశివారులోని వరద కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. మానసిక స్థితి బాగలేకపోవడం, మద్యానికి బానిసైన సుధాకర్ శుక్రవారం ఇంటి నుంచి బయటికి వెళ్లాడని పేర్కొన్నారు. వరదకాలువలో పడి మృతి చెందినట్లు స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలి

ఏర్గట్ల, జూన్ 1 : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని పార్టీ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం, ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

## వాహనాలకు నంబర్‌ప్లేట్లు కచ్చితంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్, జూన్ 1: వాహనాలకు నంబర్‌ప్లేట్లు కచ్చితంగా ఉండాలని వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే వారం నుంచి కంబైన్డ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్, ఆర్టీప శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

## నందిగామలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఏర్పాటు చేయాలి

నవీపేట, జూన్ 1: మండలంలోని నందిగామ గ్రామంలో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయాలని జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంజీవ్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. మారుమూల గ్రామమైన గుట్ట మధ్యలో ఉన్న నందిగామలో ఏ నెట్ వర్కుకు సంబంధించి టవర్లు లేవని, దీంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ అందక పింఛన్‌దారులు, ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

ఆర్మూర్‌టౌన్, జూన్ 1: పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు శనివారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ కళాశాలలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు.

# విద్యుత్ పనుల నిలిపివేతపై ఆగ్రహం

**కమ్మర్‌పల్లి తహసీల్ ఎదుట చౌట్‌పల్లి రైతుల ధర్నా**



కమ్మర్‌పల్లి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మోర్తాడ్, జూన్ 1: తమ భూముల్లో కొనసాగుతున్న విద్యుత్ పనులను నిలిపివేసిన అధికారుల తీరుపై కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారుల తీరును నిరసిస్తూ కమ్మర్‌పల్లి తహసీల్ కార్యాలయం ఎదుట శనివారం పురుగు మందు డబ్బాలతో ధర్నా చేపట్టారు. తమకు న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ శివారులోని తమ భూముల్లో కొనసాగుతున్న పనులను ఆపివేయించడానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన సునీల్‌రెడ్డి ఎవరని ప్రశ్నించారు. తాము సాగుచేసుకుంటున్న భూముల్లో విద్యుత్‌సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకున్నామని తెలిపారు. కొనసాగుతున్న పనులను కావాలనే ఆపివేయించారని ఆరోపించారు.

**పనుల నిలిపివేతలో ఆంతర్యమేంటీ?**

మూడేండ్ల క్రితం రాజ్‌గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి తాము భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, అటవీశాఖల ఆధ్వర్యంలో సర్వే పూర్తికాగా.. కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ కూడా వచ్చిందన్నారు. 2023 ఏప్రిల్ నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని, విద్యుత్ కోసం డీడీలు కూడా చెల్లించి తొమ్మిది నెలలు కావస్తోందన్నారు. విద్యుత్ పనులు కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు సునీల్‌రెడ్డి ఆపివేయించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ధర్నా విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్సై రాజశేఖర్ అక్కడికి చేరుకొని రైతులతో చర్చించారు.అటవీభూములు కబ్జాలో ఉన్నాయంటూ మంత్రి కొండాసురేఖకు అమీర్‌నగర్ గ్రామస్తులు ఫిర్యాదు చేయగా.. ఈ విషయాన్ని డీఎఫ్‌వోకు తెలియజేసినట్లు అధికారులు తెలిపారు. అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహించి ఎన్‌వోసీ ఇచ్చే వరకు ఆగాలని రైతులను సముదాయించారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, తాము పంటలు పండించుకోవాలనే విద్యుత్‌సౌకర్యం కోసం దరఖాస్తులు చేసుకున్నామని తెలిపారు. రెండుసార్లు రెండుశాఖల ఆధ్వర్యంలో సర్వే జరిగిన భూముల్లో విద్యుత్‌పనులు జరగకుండా అధికారులే అడ్డుకుంటే తమ పరిస్థితి ఏమిటని రైతులు వాపోయారు. ఎన్నికల కోడ్ ముగియగానే సర్వే నిర్వహిస్తామని, అప్పటి వరకు ఓపిక పట్టాలని రైతులను అధికారులు సముదాయించారు. ఆందోళనలో రైతులు సుమంత, సత్తెమ్మ, చందన, కొట్టాల రాజేశ్వర్, కొట్టాల అరుణ, కొమ్ముల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలి

**ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్**

బోధన్, జూన్ 1: బోధన్ డివిజన్ నుంచి కౌంటింగ్ కోసం విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది సకాలంలో కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 3న నిర్వహించనున్న కౌంటింగ్‌కు విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమయానికి కౌంటింగ్ కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో సాజీద్ అలీ, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో కౌంటింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS
★Wanted Teachers to teach English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant Little Hearts High School, Namdevwada, Nizamabad. Cont: 9948712344, 9666020695
NTZ-324927

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

శుభవార్త
★నిరుద్యోగ యువతి, యువకులకు జీవితంలో ఆర్థికంగా స్థిరపడే గొప్ప వ్యాపార అవకాశం కలదు. ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి: సెల్: 9059962194.
NTK-311380

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

## అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలి

**డీఈవో దుర్గాప్రసాద్**



ముల్లంగి(బి)లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

మాక్లూర్, జూన్ 1: అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మండలంలోని ముల్లంగి(బీ) గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను డీఈవో దుర్గాప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 వరకు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ.6.95 లక్షలు మంజూరైనట్లు పీఆర్ ఏఈ తెలిపారు. తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా పను లను వెంటనే చేయించాలన్నారు.

### ఆర్మూర్‌లో.. మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, జూన్1: అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పట్టణంలోని పలు పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ రఘు ఉన్నారు.

### నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలి

రెంజల్, జూన్ 1 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న పనులను గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ , పీఆర్‌ఏఈ వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని దూపల్లి జడ్పీ, సాటాపూర్‌ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.


## షర్బతీ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శక్కర్‌నగర్, జూన్ 1: బోధన్ పట్టణంలోని అనిల్ టాకీస్ చౌరస్తాలోని షర్బతీ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటికి తీయించి బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ దవాఖానాకు తరలించినట్లు పట్టణ సీఐ సంద్ర వీరయ్య తెలిపారు. గతనెల 30న సదరు వ్యక్తి ఓ బ్యాగ్‌తో రోడ్డు పక్క షర్బతీ కెనాల్ పక్కనే నిలబడి కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు సీసీ పుటేజీల ద్వారా పోలీసులు గుర్తించారు. సదరు మృతుడికి చెందిన ఎలాంటి ఆనవాళ్లు, గుర్తులు లేవని పేర్కొన్నారు. ఎవరైనా గుర్తిస్తే బోధన్ దవాఖాన లేదా 8712659870 నంబరుకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

## ముఖద్వారం ప్రారంభం

ఆర్మూర్‌టౌన్, జూన్1: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీ ముఖద్వారాన్ని శనివారం ప్రారంభించారు. కాలనీవాసుల సహకారంతో కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభించుకొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## చల్ల చల్లగా..



వేసవి ఎండలు దంచికొడుతున్నాయి. రెండురోజులుగా వేడి మరింత పెరిగింది. దీంతో బయటికి వెళ్లలేని పరిస్థితి. కూలర్లు కూడా వేడిని తగ్గించలేని స్థితి. ఈనేపథ్యంలో వేడి నుంచి ఉపశమనం పొందడానికి చాలామంది సాయంత్రం స్నానాలు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాల్లోని నీటితొట్టిల్లో స్నానాలు చేస్తూ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

-మోర్తాడ్, జూన్ 1